క్లుప్తంగా

ఆక్రమణల తొలగింపు


జేసీబీతో ఆక్రమణల తొలగింపు

విజయనగరం టౌన్: మాన్సాస్ ట్రస్టుకి సంబంధించిన భూముల్లో ఆక్రమణలు తొలగిస్తున్నట్లు మాన్సాస్ ట్రస్ట్ ఈఓ కెఎన్‌విడివి.ప్రసాద్ తెలిపారు. ఆనందపురం మండలం బోని గ్రామానికి ఆనుకుని ఉన్న మాన్సాస్‌కి చెందిన 200 గజాల స్థలంలో రోడ్డు పక్కన కాంక్రీట్ స్లాబ్‌తో నిర్మించిన ఆరు షాపులను జేసీబీతో తొలగించామన్నారు. ఇటుకలతో కూడిన షెడ్డును నేలమట్టం చేశామన్నారు. ట్రస్ట్ సిబ్బంది, సింహాచలం సెక్యూరిటీ సిబ్బంది సహకారంతో ఆక్రమణదారులు నిర్మించిన కట్టడాలను పూర్తిగా తొలగించామని స్పష్టం చేశారు.

వినికిడి పరికరాల పంపిణీ


దివ్యాంగులకు వినికిడి పరికరాలను పంపిణీ చేసిన క్లబ్ సభ్యులు

విజయనగరం : జ్ఞానేంద్రియాలలో ముఖ్యమైన భాగం చెవులని, వినికిడి శక్తి కోల్పోతే, కళ్లు కనిపించినా జీవితం శూన్యమని సాయికృష్ణా వాకర్స్ క్లబ్ ఎలక్ట్ గవర్నర్ ఎ.తిరుపతిరావు అన్నారు. దివ్యాంగుల శాఖ జిల్లా అడిషనల్ డైరెక్టర్ సహకారంతో అయ్యన్నపేట జంక్షన్‌లోని నడక మైదానంలో శ్రీ సాయికృష్ణా వాకర్స్ క్లబ్ అధ్యక్షులు తాడ్డి ఆదినారాయణ ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవంతుడు ప్రసాదించిన మన శరీరాన్ని, ముఖ్యంగా ఇంద్రియాలను చాలా జాగ్రత్తగా ఆరోగ్యవంతంగా కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ ఎ.ఎస్.ప్రకాశరావు, క్లబ్ కోశాధికారి ఆర్.సి.హెచ్.అప్పలనాయుడు, ఉపాధ్యక్షుడు వల్లూరి శ్రీనివాసరావు సభ్యులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేను పక్కాగా చేపట్టాలి

భోగాపురం: రైతులకు సంబంధించిన భూముల రీసర్వేను పక్కాగా చేపట్టాలని ఆర్‌ఎస్‌డీటీ రవి సూచించారు. మండలంలోని రావాడ పంచాయతీ పరిధిలో జరుగుతున్న భూముల రీసర్వే కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌డీటీ రవి మాట్లాడుతూ భూముల హద్దుల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఆలోచనతో ప్రభుత్వం ఈ భూముల రీసర్వే కార్యక్రమాన్ని కొనసాగిస్తోందని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సురేష్, సీనియర్ అసిస్టెంట్ రవికుమార్, వీఆర్‌ఓ కాళి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్‌దారుల ధర్నా



పోస్టాఫీస్ వద్ద ధర్నా చేస్తున్న ఈపీఎఫ్ పింఛన్‌దారులు

నెల్లిమర్ల: తమకు కనీస పింఛన్ రూ.9వేలు ఇవ్వాలని ఈపీఎఫ్ పింఛన్‌దారుల సంఘం జిల్లా నాయకుడు కిల్లంపల్లి రామారావు, మండల నాయకుడు ఎం.పాపారావు డిమాండ్ చేశారు. స్థానిక పోస్టాఫీసు వద్ద బుధవారం వీరి ఆధ్వర్యంలో ధర్న చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఈపీఎఫ్ 95 పింఛనర్ల సంఖ్య 78 లక్షల పైబడి ఉన్నారన్నారు. మోదీ ప్రభుత్వం కనీస పింఛన్ కోసం ఆలోచన చేయడం లేదన్నారు. ధర్నాలో సంఘ నాయకులు పద్మనాభం, అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

పూసపాటిరేగ: సమాచార హక్కు చట్టం ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని సమాచారం హక్కు చట్టం జిల్లా కోఆర్డినేషన్ మెంబరు దొడ్డి సూర్యారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో 2005 సమాచార హక్కు చట్టంపై సమాచార హక్కు చట్టం కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ తాడ్డి గోవింద, ఎంపీడీఓ ఎం.రాధిక, ఈఓపీఆర్‌డీ జ్ఞానేశ్వరరావు, కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్ట్ కుటుంబానికి సాయం

విజయనగరం టౌన్: బ్రెయిన్‌కి శస్త్ర చికిత్స జరిగి ప్రస్తుతం మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జర్నలిస్ట్ శ్రీను కుటుంబానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని హజరత్ ఖాదర్‌వలీ బాబా దర్బార్, దర్గా ధర్మకర్త డాక్టర్ ఖలీల్‌బాబు కోరారు. ఈ మేరకు శ్రీను ఆరోగ్య పరిస్థితిని, అతని కోసం విరాళాలు సేకరిస్తున్న జర్నలిస్టులను బుధవారం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తన వంతు బాధ్యతగా రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందజేస్తున్నానని, చీమలపాడు బాబా దర్బార్ పీఠాధిపతి ఖాజా మోహియుద్దీన్, సిద్దిక్‌ల చేతుల మీదుగా జర్నలిస్టులకు అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు ఎమ్.ఎల్.నాయుడు, జి.కోటేశ్వరరావు, శివప్రసాద్, గోవిందరావు, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మూడు శాఖలు.. ఒక కార్యాలయం

- సారిక సచివాలయంలో ఇదీ పరిస్థితి
- కార్యాలయ భవనాలున్నా... పట్టించుకోని పాలకులు
- ప్రజలకు తప్పని అవస్థలు



సారిక గ్రామ సచివాలయం


సచివాలయంలో ఆర్బీకే సిబ్బంది సేవలు


సచివాలయంలో ఆయుష్మాన్ భారత్ సిబ్బంది సేవలు

విజయనగరం రూరల్: గ్రామ స్వరాజ్యం స్థాపనే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేసింది. ప్రభుత్వ పాలనను గ్రామ స్థాయిలోకి వికేంద్రీకరించి ప్రజల చెంతకే సేవలు అందించాలనే సదుద్దేశంతో అవసరమైన చర్యలూ చేపట్టింది. ఇందులో భాగంగా గ్రామ, వార్డు స్థాయిలో సచివాలయం, వైద్య శాఖకు సంబంధించిన ఆయుష్మాన్ భారత్, రైతులకు అందుబాటులో రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. జగనన్న హయాంలో ఇవి బాగానే పని చేసి ప్రజలకు చేరువయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ కార్యాలయాలను, సేవలను ఉద్దేశపూర్వకంగానే నిర్వీర్యం చేస్తున్నాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. కూటమి పాలనలో సచివాలయ సేవలు సక్రమంగా అందకపోగా అన్ని శాఖలను ఒకేచోట విధులు నిర్వహించేలా చేస్తున్నా.. పాలకులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్న తీరు విస్మయపరుస్తోంది. ఇందుకు ఉదాహరణే విజయనగరం మండలంలోని సారిక గ్రామం. ఇక్కడ వైద్య శాఖకు సంబంధించి ఆయుష్మాన్ భవన నిర్మాణం పూర్తయినా నేటికీ ప్రారంభించకపోవడంతో సంబంధిత సిబ్బంది సచివాలయంలోనే వైద్య సేవలను అందిస్తున్నారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన సిబ్బంది కూడా ఆర్బీకే ఉన్నా సచివాలయంలోనే విధులు నిర్వహిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆయా శాఖలకు సంబంధించిన భవనాలను నిర్మించి పూర్తి స్థాయి సిబ్బందిని నియమించి అక్కడే సేవలు అందించేలా చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక వారికి నచ్చిన చోట విధులు నిర్వహించడం జరుగుతోంది. దీంతో సచివాలయానికి వచ్చే ప్రజలకు ఏ సిబ్బంది ఎవరో.. ఎవరిని కలవాలో తెలియక తికమక పడుతున్నారు. ఇదే అదనుగా సచివాలయ సిబ్బందిలో కొందరు క్షేత్ర స్థాయి పర్యటన పేరిట విధులకు డుమ్మా కొడుతున్నారు. ఇంత జరుగుతున్నా.. సంబంధిత ఉన్నతాధికారులుగాని, కూటమి పాలకులుగాని కనీసం పర్యవేక్షణ చేయకపోగా చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఇదే విషయమై ఎంపీడీఓ గంటా వెంకటరావు వద్ద సాక్షి ప్రస్తావించగా ఆయా శాఖల భవనాల నిర్మాణం పూర్తవ్వకపోవడం వల్ల ఒకే చోట సేవలను అందిస్తున్నామని చెప్పారు. త్వరలోనే అసంపూర్తి భవనాలను పూర్తి చేస్తామని తెలిపారు.

ఈ పంట నమోదు చేయించుకోవాలి

- జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు


వరి పొలాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రామారావు

డెంకాడ: రబీ పంటలు సాగు చేసే రైతులందరూ తమ పంటలను ఈ-పంట నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు అన్నారు. మండలంలోని పినతాడివాడ, పేడాడ రెవెన్యూ గ్రామాల పరిధిలోని వరి పంటను ఆయన బుధవారం పరిశీలించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యవసాయాధికారి రామారావు రైతులను ఉద్దేశించి మాట్లాడారు. పంట నమోదు వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. పంట బీమా మొదలుకుని, ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరకు సాగు చేసిన పంటను అమ్ముకోవాలంటే రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. రైతుల సేంద్రీయ విధానంలో పంట సాగు చేయడం వలన పంట కలుషితం కాకుండా ఉండటంతో పాటు పర్యావరణం బాగుంటుందన్నారు. రసాయన ఎరువుల వలన నేల సారం కూడా దెబ్బతిందన్నారు. యాంత్రీకరణ పద్ధతుల్లో పంట సాగు చేయాలన్నారు. ఆధునిక విధానంలో పంటలు సాగు చేయడం వలన రైతులకు మంచి గిట్టుబాటు ఉంటుందన్నారు. ఏఓ పూడి నిర్మల, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పూడికతీత పనులపై ఫిర్యాదు

నెల్లిమర్ల: నెల్లిమర్ల నగర పంచాయతీలో ఇటీవల చేపట్టిన కాలువ పూడికతీత పనుల్లో అవకతవకలు జరిగాయని, వాటిని వెలికితీయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఓబీసీ విభాగం చైర్మన్ రాయల తారకేశ్వరరావు కమిషనర్ అప్పలరాజును కోరారు. స్థానిక స్టేట్ బ్యాంక్ నుంచి మొయిద జంక్షన్ వరకు కాలువల్లో పూర్తి స్థాయిలో పూడికలు తీయలేదన్నారు. పలువురు వ్యాపారులు కాలువలను ఆక్రమించి పలకలు నిర్మించారన్నారు. పూడికతీత పనులపై విచారణ జరిపించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డెంకాడ: మండలంలోని డెంకాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని ఆ శాఖ అధికారి జి.సురేష్‌బాబు తెలిపారు. డెంకాడ విద్యుత్ సబ్‌స్టేషన్, లైన్ల నిర్వహణ పనులు కారణంగా విద్యుత్‌ను నిలిపి వేస్తామన్నారు. డెంకాడ, గుణుపూరుపేట, గుణుపూరు, ఆర్.ముంగినాపల్లి, డి.కొల్లాం, కె.కొల్లాం, చొల్లంగిపేట, డీఆర్ పాలెం, నగరపుపేట, పోతయ్యపాలెం, పెదతాడివాడ, పినతాడివాడ, గొడిపాలెం, వెదుళ్లవలస, దొడ్డిబాడువ, చందకపేట, మహంతిపేట, లెంకపేట, సింగవరం, నాతవలస గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

ప్రజా రవాణాకు ఇబ్బంది కలిగిస్తే ఉపేక్షించం

- నగర పాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం గంటస్తంభం: రహదారులను ఆక్రమించి ప్రజా రవాణాకు ఇబ్బందులు కలిగించే చర్యలను ఉపేక్షించబోమని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. బుధవారం డివిజన్ పర్యటనలో భాగంగా 20వ డివిజన్లో ఆయన పర్యటించారు. డాక్టర్ బీసెంట్ స్కూల్ నుంచి ప్రారంభమైన పర్యటనలో ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించే ప్రయత్నం చేశారు. తాగునీటిని వృథా చేయరాదని ప్రజలకు కమిషనర్ సూచించారు. స్థానిక సమస్యలను తెలుసుకుని సాధ్యమైన పనులను అక్కడికక్కడే పరిష్కరించారు. తాగునీరు వృథాగా పోతున్న విషయాన్ని గమనించి, నీటిని వృథా చేయరాదని మహిళలకు సూచించారు. ప్రతి కొళాయికి ఆన్ ఆఫ్ స్విచ్‌లను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. తాగునీరు సరఫరా నిర్వహణ అత్యంత వ్యయ ప్రయాసలతో కూడినదని కావున అవసరమైన నీటిని మాత్రమే వినియోగించుకోవాలని చెప్పారు. ఎండాకాలంలో నీటి ఎద్దడికి గురికాకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని, ప్రజలు కూడా తమకు సహకరించాలని కోరారు. డివిజన్ ప్రాంతంలో అక్కడక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బ్యానర్లను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అలాగే రహదారులను ఆక్రమించి బడ్డీ కొట్లు ఉండరాదని స్పష్టం చేశారు. టిఫిన్ దుకాణాలు, తోపుడు బళ్లు ఉండడానికి గమనించి వెంటనే తొలగించాలని ఆదేశించారు. ప్రజా రవాణాకు ఇబ్బందులు కలిగించే ఎటువంటి చర్యలనైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. వేకువజామునే చెత్తాచెదారాలు తొలగించే విధంగా పారిశుధ్య సిబ్బందిని అప్రమత్తం చేయాలని కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో టీపీఆర్‌ఓ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, పారిశుధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గౌతమీకి వృక్ష అవార్డు


వృక్ష అవార్డు అందుకున్న మజ్జి గౌతమి

విజయనగరం గంటస్తంభం: రెడ్‌క్రాస్ యోగా సాధన కేంద్రంలో సుందరశివరాం ఆధ్వర్యంలో యోగ సాధన అభ్యాసకురాలు మజ్జి గౌతమి బెంగళూర్ 'యోగోత్సవ' నిర్వహించిన పోటీల్లో 'వృక్ష అవార్డు' సాధించినట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే గౌతమి కుమార్తెలు తనీషా, తనిష్కలు కూడా యోగా సాధనలో నైపుణ్యం సాధించి ప్రతిభ అవార్డు కైవసం చేసుకున్నారన్నారు. వీరికి రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్, యోగా సాధన కేంద్రం తరఫున అభినందనలు తెలిపారు.

రైతులంతా ఫామ్ రిజిస్ట్రీ యాప్‌లో నమోదు కావాలి

పూసపాటిరేగ : ప్రతి రైతు ఫామ్ రిజిస్ట్రీ యాప్‌లో నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వీటీ రామారావు అన్నారు. మండలంలోని పేరాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మొక్కజొన్న సాగును బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజిస్టర్ యాప్‌లో నమోదు చేసుకొన్న తరువాత 11 అంకెల గుర్తింపు సంఖ్య వస్తుందన్నారు. దీంతో వ్యవసాయ సంబంధిత పథకాలు, రాయితీలు వర్తిస్తాయన్నారు. పీఎం కిసాన్‌లో పెండింగులో వున్న ఈకేవైసీలు వెంటనే చేసుకోవాలి అన్నారు. కార్యక్రమంలో ఏఓ కె.నీలిమ, వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బీమా సేవలపై అవగాహన కల్పించాలి

నెల్లిమర్ల: ఈ నెల 19, 20 తేదీల్లో జరగనున్న ఆర్‌పీఎల్‌ఐ, పీఎల్‌ఐ డ్రైవ్‌లో ప్రజలకు బీమా సేవలపై అవగాహన కల్పించాలని విజయనగరం పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసు కోరారు. బీమా, పొదుపు పథకాలపై నెల్లిమర్ల ఎస్‌ఓ పరిధిలో బుధవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ, నెల్లిమర్ల ఎస్‌పీఎమ్ జి.యర్రయ్య, నెల్లిమర్ల, మొయిద, కోట గండ్రేడు పరిధిలో గల జీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 20 మందికి ఉద్యోగాలు


మాట్లాడుతున్న సంస్థ టెక్నాలజీ సీఈఓ శ్రీతన్వి దామిజా

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజనీరింగ్ కళాశాలలో కిక్కర్ టెక్నాలజీ సంస్థ బుధవారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 20 మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయి. క్యాంపస్ డ్రైవ్‌లో బీటెక్, బీబీఏ విద్యార్థులు హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి తెలిపారు. తొలిత వీరికి స్క్రీనింగ్ టెస్ట్, టెక్నికల్ మరియు హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ నిర్వహించి 20 మంది విద్యార్థులను ఎంపిక చేసుకున్నారు. ఎంపిక ప్రక్రియను సంస్థ టెక్నాలజీ సీఈఓ శ్రీతన్వి దామిజా, డైరెక్టర్ శ్రీసోనాథ్ దామిజా, హెచ్‌ఆర్ నిధి చంద్రవనిషి, టెక్నికల్ మేనేజర్ అభిషేక్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు అభినందనలు తెలిపారు. కళాశాల ప్లేస్‌మెంట్స్ ఆఫీసర్స్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

నీటి పథకం ట్యాంక్ తొలగింపునకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్


రక్షిత మంచినీటి పథకం ట్యాంక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పూసపాటిరేగ : పూసపాటిరేగలో రక్షిత మంచినీటి పథకం నిర్వహణ తక్షణమే నిలుపుదల చేసి ట్యాంకు తొలగించడానికి ఉన్నతాధికారులకు నివేదిక పంపించినట్టు ఎంపీడీఓ ఎం.రాధిక తెలిపారు. సాక్షి దినపత్రికలో ప్రాణాలు పోయే వరకు పట్టించుకోరా.. అనే శీర్షికతో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎంపీడీఓ రాధికతో పాటు అధికారులు బృందం శిథిలమై కూలడానికి సిద్ధంగా వున్న రక్షిత మంచినీటి పథకాన్ని బుధవారం పరిశీలించారు. రన్నింగు వాటర్‌ను నిలుపుదల చేస్తూ గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఆ లైన్ ద్వారా బోరు నుండి డైరెక్టుగా కొళాయిలకు నీరు వెళ్లే విధంగా చర్యలు తీసుకున్నారు. ట్యాంకును తొలిగించి తక్షణమే నూతన ట్యాంకు నిర్మించడానికి ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్టు తెలిపారు. ఆమెతో పాటు మండల పంచాయతీ అధికారి జ్ఞానేశ్వరరావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు ప్రవీణ్‌శంకర్, హేమంత్‌కుమార్, కార్యదర్శిలు రాంబాబు, ధనుంజయ తదితరులు ఉన్నారు.

ఎంవీజీఆర్‌తో సీటీటీసీ అవగాహన ఒప్పందం

డెంకాడ: చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల పరిశ్రమ, సంసిద్ధతను పెంపొందించడానికి భువనేశ్వర్‌కు చెందిన సెంట్రల్ టూర్ రూమ్ అండ్ ట్రెనింగ్ సెంటర్(సీటీటీసీ)తో అవగాహన ఒప్పందం జరిగిందని కళాశాల యాజమాన్య ప్రతినిధులు బుధవారం తెలిపారు. విద్యార్థులను ఆచరణాత్మక నైపుణ్యంతో సన్నద్ధం చేయడానికి పరిశ్రమ, ఆధారిత నైపుణ్య శిక్షణ, ఇంటర్న్‌షిప్ అవకాశాలు, సాంకేతిక నిపుణుల శిక్షణ కార్యక్రమాలను అందించడం కార్యక్రమం లక్ష్యం అన్నారు. ఒప్పంద పత్రాలపై కళాశాల డైరెక్టర్ పీఎస్ సీతారామరాజు సంతకం చేశారు. సీటీటీసీ సీనియర్ ఇంజినీర్, ఏఐ విభాగం హెడ్ డాక్టర్ రీతు మైత్రి, ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, హెచ్‌ఓడీ ఎన్.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి లక్ష్యాలను శతశాతం సాధించాలి

నెల్లిమర్ల రూరల్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం నిర్దేశించిన ఉపాధి లక్ష్యాలను శత శాతం సాధించాలని డ్వామా ఏపీడీ వై.పద్మజ ఆదేశించారు. మండలంలోని తమ్మాపురం, ఒమ్మి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వేతనదారుల హాజరు, పనిదినాల కల్పనపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏపీఓ అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

మాన్సాస్ భూముల్లో హెచ్చరిక బోర్డులు



మాన్సాస్ ట్రస్ట్‌కి సంబంధించి పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీ మెయిన్ రోడ్డుతో పాటూ రోడ్డుకు అవతల ఉన్న 10.05 సెంట్ల భూమిని రెవెన్యూ సిబ్బందితో కలిసి స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు పెట్టినట్లు మాన్సాస్ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కెఎన్‌విడివి.ప్రసాద్ బుధవారం తెలిపారు. జేసీబీ సాయంతో మొత్తం భూమిని జంగిల్ క్లియరెన్స్ చేయిస్తామన్నారు. భూ ఆక్రమణదారులను గుర్తించి నోటీసులు జారీ చేస్తామన్నారు. ఖాళీ భూమిని ప్రణాళిక ప్రకారం 11 లేక 30 ఏళ్లకు బహిరంగ వేలం అధికారుల సమక్షంలో వేలం వేస్తామన్నారు. కార్యక్రమంలో మాన్సాస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. – విజయనగరం టౌన్

'భోజనం' బాగుండాలి...



మధ్యాహ్న భోజనం బాగుండాలని డీఈఓ మాణిక్యంనాయుడు నిర్వాహకులకు సూచించారు. డెంకాడ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులు ప్రీ ఫైనల్ పరీక్షలను పర్యవేక్షించారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి అక్కడ విద్యార్థులతో మాట్లాడి విద్యా ప్రమాణాలను స్థాయిని పరిశీలించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం బాగుండాలని నాణ్యత కొరవడితే చర్యలు తప్పవన్నారు. – డెంకాడ

చేప పిల్లల విడుదల



ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా విజయనగరం పరిధిలోని 11 డిపార్టుమెంటు చెరువుల్లో మత్స్య శాఖ అధికారులు లక్షా 30 వేల ఫింగర్ లింగు సైజు చేప పిల్లలను బుధవారం విడుదల చేశారు. ఈ చేప పిల్లలు పెరిగిన తర్వాత మత్స్యకారులు చేపల వేట సాగించి విక్రయించుకుంటారని మత్స్యశాఖ డిప్యూటీ డైరక్టర్ నేతల నిర్మలాకుమారి తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అభివృద్ధి అధికారి జె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం ఫోర్ట్

దుకాణాలకు తాళాలు



విజయనగరం నగరపాలక సంస్థకు సంబంధించి మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో దీర్ఘకాలంగా అద్దె బకాయిలు ఉన్న దుకాణాలను కమిషనర్ నల్లనయ్య ఆదేశాలతో బుధవారం రెవెన్యూ విభాగం అధికారులు మూసివేసి తాళాలు వేశారు. అద్దె బకాయిలు ఉన్నవాటికి రెడ్ నోటీసులు జారీ చేసినప్పటికీ అద్దెలు చెల్లించకపోవడంతో దుకాణాలను మూసివేసి తాళాలు వేశారు. మొత్తం 7 దుకాణాలను మూసి వేసినట్లు కమీషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఇప్పటికైనా సకాలంలో అద్దెలు చెల్లించాలని కోరారు. లేని పక్షంలో అపరాధ రుసుములతో అద్దెలు వసూలు చేస్తామని తెలిపారు. ఈ మధ్య 15 షాపులను సీజ్ చేశామని వారిలో 5 షాపులు అద్దెలు చెల్లించడంతో తిరిగి తాళాలను ఇచ్చి దుకాణాలు తెరిపించామని చెప్పారు. బకాయి లేకుండా ప్రతి నెల అద్దెలు చెల్లించుకోవాలని స్పష్టం చేశారు. – విజయనగరం

ఘనంగా పైడితల్లి చండీయాగం


చదురుగుడిలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: మాఘ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారికి చండీయాగాన్ని ఆలయ వేదపండితులు బుధవారం ఆలయ ఆవరణలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. చదురుగుడి, వనంగుడిల ఆవరణలో యాగప్రక్రియను వేదపండితులు తాతా రాజేష్, సాయికిరణ్, దూసి శివప్రసాద్, వెలువలపల్లి నరసింహమూర్తిలు నిర్వహించి పూజాదికాలు చేశారు. యాగ విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం అమ్మవారి శేషవస్త్రాలను, ప్రసాదాలను యాగంలో పాల్గొన్న భక్తులకు అందజేశారు. కార్యక్రమాలను ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ ప్రసాద్ పర్యవేక్షించారు.

రైతులు యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలి

భోగాపురం: స్మార్ట్ ఫోన్ కలిగి వున్న ప్రతి రైతు తప్పనిసరిగా సీఎల్‌ఎస్‌ఎస్, ఎన్‌పీఎస్‌ఎస్ యాప్‌లను తమ ఫోన్‌లలో ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఆర్‌సీ ఏడీఏ చంద్రశేఖర్ అన్నారు. మండలలంలోని రావాడ గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎల్‌ఎస్‌ఎస్, ఎన్‌పీఎస్‌ఎస్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవడం వలన రైతులు వారి పండించే పంటలలో ఏమైన పురుగులు, తెగుళ్లను గురిస్తే వెంటనే ఈ యాప్‌లలో ఫొటోలు తీసి అప్లోడ్ చేయాలన్నారు. రైతులందరూ తమ పొలాలను భూ ఆధార్ లేదా ఫార్మర్ రిజిస్ట్రేషన్‌లో నమోదు చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారి వి.హరికృష్ణ, వీహెచ్‌ఏ రాజు, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగ వ్యతిరేక విధానాలను విడనాడాలి


మాట్లాడుతున్న ఎన్‌ఎంయూ రాష్ట్ర కోశాధికారి పీవీమోహన్

విజయనగరం అర్బన్: ఆర్టీసీ సంస్థలో ఉద్యోగులపై అధికారులు వ్యవహరిస్తున్న వ్యతిరేక విధానాలను మానుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్‌ఎంయూ) రాష్ట్ర కోశాధికారి పీవీ మోహన్ డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ పంచాయతీ మినిస్టీరియల్ సిబ్బంది సంఘం భవనంలో బుధవారం జరిగన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సంఘం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. ప్రభుత్వంతో సామరస్య పూర్వకంగా సమస్యలపై స్పందిస్తూ సాధిస్తున్నామని అన్నారు. జోనల్ అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్ కార్యదర్శి బీఎస్‌రాములు, జిల్లా అధ్యక్షులు పీజీరాఫెల్, డిపో అధ్యక్ష కార్యదర్శులు బీ.రామారావు, కే.చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.